క్లుప్తంగా

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణోత్సవం



కొత్తకోట: పట్టణ సమీపంలో గల శ్రీబ్రహ్మంగారి ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి సందర్భంగా నిర్వహించే బ్రహ్మంగారి కల్యాణోత్సవాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న బ్రహ్మంగారి కల్యాణోత్సవానికి పట్టణ కేంద్రంలోని మహిళలతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం స్వామి వారిని పల్లకీ సేవలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు నాగరాజు, వెంకటయ్యచారి, ఆనంద్‌చారి, విశ్వమోహన్, కృష్ణయ్య, వెంకటేష్, సురేంద్రచారి, సూరంపల్లి శ్రీనివాసులుచారి తదితరులు ఉన్నారు.

బీటీగా మారేదెన్నడో?



అమరచింత: పట్టణంలోని భగత్‌సింగ్ విగ్రహం నుంచి మూలమళ్ల వరకు ఉన్న కచ్చ రహదారిని బీటీగా మార్చాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం దక్కడం లేదు. సుమారు ఐదున్నర కిలోమీటర్ల మట్టి రహదారికి బీటీ కోసం ప్రభుత్వం పలు దఫాలుగా నిధులను మంజూరు చేయడం, పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిధులు సరిపోవని వెనక్కి వెళ్లడంతో పరిపాటిగా మారింది. ఇరు గ్రామాల ప్రజలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగపడే రహదారి కావడంతో దానిని బాగు చేయాలంటూ ఇరు గ్రామాల రైతులు సంబంధిత అధికారులకు, ఎమ్మెల్యేకు వేడుకుంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకం ఆయకట్టు అధిక భాగం ఇరుగ్రామాల మధ్య ఉండటంతో ఎత్తిపోతల సంఘం డైరెక్టర్లు, రైతులు రహదారిని సీసీగా మార్చమంటూ పీజేపీ అధికారులకు గతంతో విన్నవించారు. రైతుల విన్నపానికి స్పందించిన ఇరిగేషన్ శాఖ అధికారులు రహదారి పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చి పరిస్థితులను అంచనా వేశారు. ఇటు ఇరిగేషన్, అటు పీఆర్ అధికారులైన కచ్చ రహదాని రూపు రేఖలు మార్చాలంటూ రైతులు కోరుతున్నారు.

నేరాలపై ప్రజలకు అవగాహన

పెబ్బేరు: మండలంలోని అయ్యవారిపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో మైనర్లు బైకులు నడపడం, బాల్యవివాహాలు, దొంగతనాలు, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, చిన్నచిన్న గొడవలు, రోడ్డు ప్రమాదాలతో వచ్చే నష్టాలను వివరించారు. కేసులతో కోర్టులు, జైళ్ల చుట్టు తిరిగి జీవితాలను నాశనం చేసుకోకూడదని, చిన్న చిన్న తగాదాలను గ్రామాల్లో పరిష్కరించుకొని, ఐకమత్యంగా నడవాలని ఎస్‌ఐ జగదీష్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వాతిగౌడ్, ఉప సర్పంచ్ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



కొత్తకోట రూరల్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లిలో పంచాయతీ కార్మికులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతనాలను పెంచాలంటూ ఈనెల 12నుంచి పాల్వంచలో చేపట్టిన పాదయాత్ర 28న హైదరాబాద్‌లో ముగిస్తుందన్నారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటూ చాలిచాలనీ వేతనాలు ఇస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జీఓ నం.51 సవరించి ఎవరి పనులు వాళ్లే చేసుకునే విధంగా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, కార్మికులు కృష్ణయ్య, లలితమ్మ, కుర్మయ్య ఉన్నారు.

రేపు మండల సమావేశం

బిజినేపల్లి: మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని సూచించారు.

నీలకంఠాయ.. నమో నమః

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శనివారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో శివాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు. మండలంలోని కేతేపల్లి, రేమద్దుల, రాయినిపల్లి, బుసిరెడ్డిపల్లి, గోప్లాపూర్, శాగాపూర్, మాందాపూర్,అన్నారం, చిక్కేపల్లి, కొత్తపేట గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గోపాల్‌పేట: బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో దేవస్థాన ట్రస్ట్ చైర్మన్ హరిచరణ్, రాజేశ్వర్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపాల్‌పేట శివాలయం, కేశంపేట, రేవల్లి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెబ్బేరు రూరల్: మండలకేంద్రంలో రంగనాథస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు తూముకుంట, కల్వరాల తదితర గ్రామాల్లోని శివాలయాలల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎంపీపీ కమలేశ్వర్‌రావు, జెడ్పీటీసీ మాధురి, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, సింగిల్ విండో చైర్మన్ రామన్‌గౌడ్ మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఖిల్లాఘనపురంలోని శివాలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమరచింత: మండలంలోని చంద్రగఢ్ కోటపై వెలసిన శివాలయంతో పాటు వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు పాల్గొని పూజలను నిర్వహించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఆంజనేయస్వామి, సాయిబాబ ఆలయం, శివాలయంలో భక్తులు పరమ శివుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో విఘ్నేశ్వరుడికి, శివలింగానికి బిల్వపత్రాలతో పాటు అభిషేకాలు, పూజలు నిర్వహించి మొక్కులు తిర్చుకున్నారు.

ఆత్మకూర్: మండలంలో ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రాకి బాలబ్రహ్మేశ్వరస్వామి, శ్రీచెర్లపరమేశ్వరస్వామి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శివనామస్మరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే స్థానిక శ్రీ షిర్డిసాయిబాబా, వేంకటేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామి, కన్యకాపరమేశ్వరి, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలతోపాటు పరమేశ్వర స్వామి చెరువు మధ్యలో ఉన్న శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. పీజేపీ క్యాంప్‌లోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున ఆలయంలో, బీసీ కాలనీలోని శివాలయంలో పూజలు చేశారు. బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 5గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 4.30నుంచి ధర్మ దర్శనం, రాత్రి 9గంటలకు అఖండ భజన కార్యక్రమం, అనంతరం గిరిజాకల్యాణం నిర్వహించి భక్తులకు ప్రసాదం అందించారు.



పామాపురంలో శివుడిని దర్శించుకున్న జడ్జి శిరీష కుటుంబ సభ్యులు

పోలీసుల బందోబస్తు

చెరువుమధ్యలో ఉన్న పరమేశ్వరస్వామి ఆలయం వద్ద నీటి ఉధృతి అధికంగా ఉండడంతో ఆత్మకూర్ ఎస్‌ఐ మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తును నిర్వహించారు.

రమణీయం శివపార్వతుల కల్యాణం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయం, మండలంలోని రోడ్డుమీదితండా తదితర గ్రామాల్లో శనివారం శివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కుర్వగేరి శివాలయం, పర్వతాపురం శివ రామలయం తదితర ఆలయాలతో పాటు గ్రామాల్లోని శివాలయాలు, అప్పారెడ్డిపల్లి వాగులోని శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వీరన్న గుట్టపై వెలిగించిన అఖండ జ్యోతి



వనపర్తిలో..



ఖిల్లాఘనపురంలో..



పాన్‌గల్‌లో ఆశ్రమ పీఠాధిపతులు



ఆత్మకూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో..



బుద్దారం ఆలయంలో భక్తులు



వనపర్తిలో ప్రసాద వితరణ చేస్తున్న సభ్యులు

భాగ్యరెడ్డివర్మకు ఘన నివాళి

వనపర్తి టౌన్: హైదరాబాద్ కేంద్రంగా దళిత ఉద్యమానికి, అభివృద్ధి కోసం ఎనలేని పోరాటాలు చేసిన భాగ్యరెడ్డివర్మ సేవలు చిరస్మరణీయమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శనివారం భాగ్యరెడ్డివర్మ వర్ధంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ.. ఉద్యమకారుడిగా, హక్కుల కార్యకర్తగా, రచయితగా, పాత్రికేయుడిగా దళితులకు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై భాగ్యరెడ్డివర్మ గళమెత్తారని గుర్తుచేశారు. దళితులకు గౌరవం దక్కాలంటే విద్య కీలకమని గుర్తించి హైదరాబాద్‌సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించారన్నారు. విద్య ద్వారానే దళితుల్లో మార్పు వస్తుందని ఆశించిన మహోన్నతుడు భాగ్యరెడ్డివర్మ అని కొనియాడారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, కవి ఈశ్వర్, డప్పు నాగరాజు, గద్వాల కృష్ణ, వెంకటస్వామి, వెంకటేష్, రంగస్వామి, రాములు, విజయ్‌కుమార్, చిన్నరాములు, నరసింహ, దేవన్న నాయుడు, పరమేశ్వర చారి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

'దళితబంధు' తక్షణమే విడుదల చేయాలి



మాట్లాడుతున్న రాము

వీపనగండ్ల: దళిత కుటుంబాలు ఆర్థికంగా బలపడాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకానికి సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో దళితబంధు నిధుల విడుదల కోసం ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నాకు సంబంధించిన పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దళితబంధు నిధుల కోసం రూ.17,700 కోట్లు కేటాయించడంతో పాటు లబ్ధిదారులను గుర్తించి వెంటనే పంపిణీ చేయాలని కోరారు. నిధులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసినప్పుడే దళిత కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని, ఖాళీ జీఓలతో ఎలాంటి ప్రయోజనం చేకూరదన్నారు. నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దండోరా యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు రాజశేఖర్, మద్దిలేటి, గంగులి, దేవ, రాధాకృష్ణ, ప్రసాద్, శివ, శ్రీరాం, శివకృష్ణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం

వనపర్తి క్రైం: సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చకుండా.. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ ఎద్దేవా చేశారు. శనివారం వనపర్తి మండలంలోని రాజపేటలో ఏర్పాటు చేసిన శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ అబద్దాలు, మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ రాష్ట్రంలో నిరంకుశ, కుటుంబ పాలన సాగిస్తున్నారని.. ఇకనైనా ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని హితవు పలికారు. ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఉద్యమకారుల ఆశయాలకు గండి కొట్టారని, విద్య, వైద్య వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటూ నిధుల్ని దారి మళ్లిస్తూ అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్న కేసీఆర్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ సూత్రదారి ఎమ్మెల్సీ కవిత దంపతులను సీబీఐ ఏ క్షణమైన అరెస్ట్ చేసే అవకాశాలు ఉన్నాయని, ఆ విషయాలన్ని ప్రజల దృష్టి మళ్లించడానికి బీఆర్ఎస్ పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, అందుకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, మండల అధ్యక్షుడు దేవేందర్, నాయకులు పెద్దిరాజు, సుదర్శన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బి.కృష్ణ

విద్యుత్ పరికరాల కొనుగోలులో అవినీతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ ముస్లిం కమిటీ నాయకులు

అమరచింత: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయా వార్డుల్లో, ఇతర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ పరికరాల కొనుగోలు వ్యవహారంలో అవినితి జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజాకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్, తౌఫిక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2020, 2021, 2022 సంవత్సరాల్లో కొనుగోలు చేసిన విద్యుత్ పరికరాలు తీగలు, వీధి దీపాలు, స్విచ్‌లు, బోర్డులు, ఫ్యానులు, ట్యూబులు, వాటర్ సరఫరాకు ప్లంబింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని ఆరోపించారు. మున్సిపాలిటీ ద్వారా విద్యుత్ పరికరాల కొనుగోలు కోసం టెండర్ వేయకుండా బయట కొనుగోలు చేసి రూ.లక్షల్లో అవినీతి చేశారని ఆరోపించారు. వీటికి సంబంధించిన కొనుగోలు రశీదులు తమకు సమాచార చట్టం ద్వారా ఇవ్వాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిచామని తెలిపారు. పక్షం రోజుల్లో విద్యుత్ పరికరాల కొనుగోలుకు సంబంధించిన బిల్లుల జిరాక్స్ కాపీలను ఇవ్వాలన్నారు. వీటికి అయ్యే ఖర్చులను మున్సిపల్‌కు చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అశు, ఖాసీం, అక్బర్, ఖాదర్, అబీద్, సద్దాం పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలపై 50 శాతం సబ్సిడీ

పాన్‌గల్: మండలంలోని సింగిల్ విండో కార్యాల యం ద్వారా దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు 50 శాతం సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు చెల్లింపు విషయంలో ఈ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. దీంతో పాటు గతంలో పంట రుణా లు తీసుకున్న రైతులు తమ రుణాలను రెన్యూవల్ చేసుకోవాలని ఆయన సూచించారు. దీర్ఘకాలిక రుణాలపై పూర్తి సమాచారం కోసం సింగిల్ విండో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఆర్టీఐ చైర్మన్‌గా పార్టీ తనను ప్రకటించిందని కొంకి రమేష్ పేర్కొన్నారు. శనివారం పార్టీ పెద్దల నుంచి సమాచారం అందిందని, నియమించిన నేషనల్ చెర్మన్ అనిల్‌కుమార్, శివసేనారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ఎల్ల వేళలా కష్టపడి పనిచేస్తానన్నారు.

పీహెచ్‌సీల్లోనే మెరుగైన వైద్యం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఎంతోమంది గర్భిణులకు సుఖ ప్రసవాలు జరిగే విధంగా అన్ని వసతులు ఏర్పాటు చేశామని, ఉమ్మడి మండలాల్లోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రాథమిక వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. చిన్నంబావి, వీపనగండ్ల మండలాల్లోని గర్భిణులను స్థానిక పీహెచ్‌సీల్లోనే చేరేలా ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

ఈనెల 24న హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

కొల్లాపూర్: పట్టణంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్ప మందిరం ప్రాంగణంలో ఈనెల 24వ తేదీన భారీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. పట్టణానికి చెందిన ఆకుతోట చంద్రకళ, శేషయ్య దంపతులు ఈ విగ్రహాన్ని తయారుచేయించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు 22వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, 23న విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు, 24న ఉదయం 8 గంటలకు ప్రతిష్ఠాపన ఉన్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

నర్సరీ ఇలా.. మొక్కలు ఎదిగేది ఎలా..

అమరచింత: మండలంలోని చంద్రనాయక్‌తండాలో ఏర్పాటు చేసిన నర్సరీ నిర్వహణలో అధికారులు అలసత్వం కనిపిస్తుంది. గ్రామానికి పది వేల మొక్కలు పెంచాలనే ఉద్దేశ్యంతో పంచాయతీ ద్వారా ఈజీఎస్ అధికారులు ఆయా గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు చేశారు. చంద్రానాయక్‌తండాలో నర్సరీని ఏర్పాటు చేసిన అధికారులు వాటిలో మొక్కలను పెంచాలనే విషయంపై దృష్టిని సారించలేక పోతున్నారు. విత్తనాలు ఖాళీ సంచుల్లో విత్తడం, అవి మొలకెత్తకుంటే మరోమారు విత్తడం వంటి కార్యక్రమాలను చేపట్టలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నర్సరీల్లో మొక్కల పెంపకంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం అధికారులపై ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



చంద్రనాయక్ తండాలోని నర్సరీ దుస్థితి

క్రీడాకారులకు సామగ్రి అందజేత



క్రీడాకారులకు వాలీబాల్స్‌ను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

అమరచింత: ప్రతి నిత్యం క్రీడాకారులు తమకు ఇష్టమైన క్రీడల్లో రాణించి తమ లక్ష్యసాధనలో ముందుకు సాగాలని మక్తల్ బీఆర్ఎస్ నాయకుడు, వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రతి నిత్యం వివిధ క్రీడల్లో పాల్గొంటూ శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు మైదానంలో సరైన సౌకర్యాలు లేవనే విషయాన్ని స్వయంగా మైదాన పరిశీలనకు వెళ్లిన వర్కటం జగన్నాథ్‌రెడ్డికి క్రీడాకారులు తమ సమస్యలను తెలియచేశారు. దీంతో క్రీడాకారుల విన్నపం మేరకు స్పందించిన వర్కటం జగన్నాథ్‌రెడ్డి రూ.45 వేల వ్యయంతో నాలుగు ఎల్ఈడీ బల్బులు, 4 వాలీబాల్స్ శనివారం క్రీడాకారులకు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అందించటమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడం, పదో తరగతి వారికి ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించామని తెలిపారు.

సామాజిక సేవ చేయాలి

యువకులు క్రీడా స్ఫూర్తిని అలవర్చుకొని, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. విద్యార్థులకు, క్రీడాకారులకు ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులు జగన్నాథ్‌రెడ్డికి శాలువ, పూలమాలతో సత్కరించారు. తమ సమస్యను తెలుసుకొని పరిష్కరించడం ఎంతో సంతోషమన్నారు. భవిష్యత్తులో వర్కటం చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, గణేష్, బీమా, మసన్న, ప్రతీష్, దిలీప్, అజయ్, అభినయ్, స్టీవెన్, సాయి విజయ్, స్వరాజ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా పందుల సంచారం

అమరచింత: మున్సిపాలిటీలోని ఆయా వార్డుల్లో పందుల సంచారం మితిమీరిపోతున్నా మున్సిపాలిటీ అధికారులు, పాలక వర్గం వీటిని అరికట్టలేని దుస్థితితో ఉన్నారు. పందులను పట్టణ శివారుకు తరలించాలని పందుల పెంపకందారులకు పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు హెచ్చరించినా పాలక మండలిలోని కొంత మంది కౌన్సిలర్ల అండతో వారు పందులను పట్టణ శివారుకు తరలించట్లేదు. ఇతర మున్సిపాలిటీల్లో కుక్కల తరలింపు కార్యక్రమం చేపట్టినా అమరచింత మున్సిపాలిటీలో మాత్రం పందులు, కుక్కల విచ్చలవిడిగా తిరగనిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల కిందట మున్సిపల్ కమిషనర్ బెంగుళూరు ప్రాంతానికి చెందిన కొంతమందిని పిలిపించి పందులను పట్టణ శివారుకు తరలించడానికి ప్రయత్నం చేశారు. కానీ రాజకీయ నాయకులు ప్రమేయం, కౌన్సిలర్ల ఒత్తిడితో కార్యక్రమాన్ని నిలిపివేశారు. అప్పటి నుంచి పందుల యాజమానులు వీటిని తరలిస్తామని చెప్తున్నారే తప్పా.. ముందడుగు మాత్రం పడట్లేదు. పందుల సంచారంతో ప్రజలకు మెదడువాపుతో పాటు డెంగ్యూ జ్వరాలు సోకుతున్నాయని, వెంటనే వీటిని తరలించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



అమరచింత ఎస్సీ కాలనీలో సంచరిస్తున్న పందుల మంద

మిషన్ భగీరథ పైపు ధ్వంసం



పాన్‌గల్: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో పైపు లైన్ల ఏర్పాట్లలో భాగంగా జేసీబీతో కాల్వ తవ్వుతున్న క్రమంలో మిషన్ భగీరథ పైపు ధ్వంసమై తాగునీరు వృథాగా పోతుంది. వెంటనే పంచాయతీ సిబ్బంది స్పందించి నీటి సరఫరాను నిలిపివేసి పైపులైన్లకు మరమ్మత్తు చేపట్టారు.